www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 166 | హైదరాబాద్ | బుధవారం | 08-10-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## గెలిపించాక పార్టీ మారితే తుక్కుతుక్కు చేస్తాం..



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

'స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు కష్టపడి గెలిపించాక అభ్యర్థులు పార్టీ మారితే వదిలిపెట్టం. వెయ్యి మందిని తీసుకొచ్చి వారి ఇంటి మీద దాడి చేసి.. తుక్కుతుక్కు చేస్తాం' అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో భారత రాష్ట్ర సమితి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు గెలిచాక పార్టీ మారితే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఇది నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని పార్టీ అభ్యర్థులందరికీ వర్తిస్తుందని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలనే వదిలిపెట్టలేదని, మిమ్మల్ని ఎలా విడిచిపెడతామని పేర్కొన్నారు.

## రేవంత్ మాటల్లో ఫేకుడు..
# చేతల్లో జోకుడు

**టీవీవీపీ, బస్తీ దవాఖానల సిబ్బంది వేతనాలు పెండింగ్**

**సీఎం మాటలు కోటలు దాటతాయి కానీ చేతలు గడప దాటవు**

**ఉద్యోగుల పండుగలు చెడగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**జీతాలు ఇప్పుడైనా చెల్లించండి.. దీపావళి ఆనందం ఇవ్వండి**

**మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్**



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వైఫల్యాలపై ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటతాయి కానీ చేతలు మాత్రం గడప దాటవు అని ఆయన హెద్దెవ చేశారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామంటూ ప్రచారం చేసుకోవడం తప్ప, ఆచరణలో మాwత్రం శూన్యం అని హరీష్ రావు వ్యాఖ్యానించారు. రెగ్యులర్ ఉద్యోగులకు రెండు మూడు వారాలు దాటినా జీతాలు రాకపోవడం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నెలల తరబడి వేతనాలు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. "బస్తీ దవాఖానల వైద్య సిబ్బందికి అయితే ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది బతుకమ్మ, దసరా పండుగలను ఆనందించలేకపోయారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం" అని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు పలు మార్లు వినతులు చేసినా స్పందన లేకపోవడం దుర్మార్గమని, అత్యవసర సేవలు అందించే వైద్య సిబ్బందికే జీతాలు ఇవ్వకపోతే ఇతర శాఖల ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. "పథకాల్లో కోతలు, ప్రభుత్వ ..మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్లపై
# సీఎం ఫోకస్



**తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై ప్రతిష్టాత్మక దృష్టి**

**సుప్రీంకోర్టు విచారణలో రాష్ట్రానికి బలమైన వాదనలు**

**సీఎం రేవంత్- అభిషేక్ సింఘ్వి కీలక సమన్వయం**

**హైకోర్టు ముందు ప్రత్యేక వ్యూహ సమావేశం**

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని వినియోగిస్తోంది. ఇటీవల సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరఫున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వి, సిద్ధార్థ దవే లు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క, మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వి తో ఫోన్ లో మాట్లాడారు. రేపు (బుధవారం) హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలో సింఘ్విని కలసి ..మిగతా 2లో




### గుడిసెల్లో పేదలకు ఇల్లు ఇచ్చే బాధ్యత నాది

**ప్రజలు కక్షలకు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలి**

**మీ డివిజన్లను మీరే పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

02




### కాళేశ్వరంపై హైకోర్టులో విచారణ వాయిదా

**కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని ఆదేశం**

**కేసీఆర్, హరీశ్ రావుకు మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు**

**తదుపరి ఉత్తర్వులు వెల్లడించెంతవరకు చర్యలు తీసుకోవద్దు**

02

## తెరపైకి తెలుగుదేశం పార్టీ

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చంద్రబాబు ఫోకస్**

**టీడీపీ భవన్‌లో తెలంగాణ నేతలతో భేటీ**

**జూబ్లీహిల్స్ సెగ్మెంట్ ఉప ఎన్నికపై చర్చ**

**చంద్రబాబు మద్దతు ఎవరికనేదానిపై ఉత్కంఠ**




తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారిపోతున్నాయి.. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్ ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. నవంబర్ 11వ తేదీన ఉప ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరగనుండగా.. నవంబర్ 14వ తేదీన ..మిగతా 2లో


## చెవుల్లో ఇయర్‌ఫోన్స్..
## చేతిలో స్మార్ట్‌ఫోన్!

**ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై సీపీ సీరియస్ వార్నింగ్**

**డ్రైవర్లు ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేస్తే చర్యలు**

**జీవితం కంటే పెద్దది ఏ సమస్య కాదు.. జాగ్రత్తగా ఉండాలి**

**హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్**



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

రయ్.. రయ్.. మంటూ రోడ్డుపై పరుగులు పెడుతున్న వాహనాలు.. డ్రైవింగ్ సీటులో డ్రైవర్ కానీ, వారి దృష్టి రోడ్డుపై లేదు. చేతిలో మొబైల్ ఫోన్.. లేదా చెవుల్లో ఇయర్‌ఫోన్స్. ఆటో రిక్షా, క్యాబ్, బైక్ టాక్సీ ..మిగతా 2లో

## అత్యున్నత స్థాయికి అసహనం

**సీజేఐ గవాయ్‌పై బూటుతో దాడికి యత్నం**

**ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు**

**ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదు.. వ్యవస్థపై జరిగిన దాడి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్. గవాయ్‌పై ఓ న్యాయవాది బూటుతో దాడికి ప్రయత్నించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుందని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు అని అన్నారు. సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి, అసహనం పెరిగిందనడానికి సంకేతమని ఆయన పేర్కొన్నారు. ఈ దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన ఈ సిగ్గుచేటైన దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని, ఇది వ్యవస్థపై జరిగిన దాడి అని వ్యాఖ్యానించారు. విశ్వాసం వంటి సున్నితమైన అంశాలపై ఎలాంటి విభేదాలు ఉన్నా కూడా హింసను ..మిగతా 2లో

## హైదరాబాద్ రియల్ ఎస్టేట్
# స్తబ్ధతకు కారణాలివే

**మార్కెట్ నెమ్మదించడానికి హైడ్రా కారణం కాదు**

**పెరిగిన అన్‌సోల్డ్ ఇన్వెంటరీ, తగ్గిన ఎన్నారై పెట్టుబడులు**

**వడ్డీ రేట్ల పెరుగుదల, ఏఐతో ఉద్యోగ భయాలు**

**ఖమ్మం, వరంగల్‌లో కూడా ఇదే పరిస్థితి**

**హైడ్రాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్**



తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

గత కొంతకాలంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్ధతకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ఆధ్వర్యంలోని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) తీసుకుంటున్న ..మిగతా 2లో


## అసహనం అత్యున్నతస్థాయికి చేరింది

మొదటిపేజీ తరువాయి



సమర్థించకూడదని అన్నారు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు కలిగిస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు. నిన్న సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది చెప్పుతో దాడికి యత్నించడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది.

## చెవుల్లో ఇయర్‌ఫోన్స్.. చేతిలో స్మార్ట్‌ఫోన్!



మొదటిపేజీ తరువాయి

డ్రైవర్లు ఇలా చేస్తూ నగరంలో తరచుగా కనిపిస్తున్నారు. తమ జీవితంతో పాటు, ప్రయాణికుల, రోడ్డుపై ఉన్న వేలాది మంది ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెడుతున్నారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్‌లో వీడియోలు చూడడం, ఇయర్‌ఫోన్స్ వినియోగించడం చట్టరీత్యా నేరం. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, ప్రాణాలు తీసే నేరం. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ వాడటం వల్ల దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేలల్లో ప్రమాదాలు, వందల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రమాదకర ఉల్లంఘనలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్‌లు కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఇలాంటి నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్. జరిమానాలు, చట్టాలు.. ఇవన్నీ ఒకవైపు. డ్రైవర్, ప్రయాణికులు, ఇతర రోడ్డుపై ప్రయాణించే వారి భద్రత అత్యంత ముఖ్యమైనది. క్షణికావేశంలోనో, చిరు కాలక్షేపం కోసమో చేసే చిన్న పొరపాటు తీరని విషాదాన్ని మిగులుస్తుంది. జీవితం కంటే పెద్దది ఏ సమస్య కాదు. డబ్బు సంపాదించడం, ఎక్కడికో త్వరగా చేరుకోవడం, ఫ్రెండ్స్ తో మాట్లాడటం.. ఏదీ మీ ప్రాణం, మీ కుటుంబ ఆనందం కంటే ముఖ్యం కాదు.

## రేవంత్ మాటల్లో ఫేకుడు.. చేతల్లో జోకుడు

మొదటిపేజీ తరువాయి



ఉద్యోగులకు వేతనాలు చెల్లించక వాతలు.. ఇదే రేవంత్ రెడ్డి పాలన. మాటల్లో ఫేకుడు, ఢిల్లీకి వెళ్లి జోకుడు. నీ వైఫల్యం రాష్ట్ర ప్రజలందరికీ శాపంగా మారింది" అంటూ హరీశ్ రావు తీవ్రంగా దుయ్యబట్టారు. "జీతాలు ఇవ్వకుండా 13 వేల మంది వైద్య సిబ్బందికి దసరా దూరం చేసావు. కనీసం ఇప్పుడైనా జీతాలు చెల్లించి వారికి దీపావళి సంబురం ఇవ్వాలి" అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గుడిసెల్లో బతికే పేదలకు ఇల్లు ఇచ్చే బాధ్యత నాది..

- ప్రజలు కక్ష్యలకు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలి
- మీ డివిజన్లను మీరే పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

ఖమ్మం నగరంలో రోడ్లు, డ్రైనేజీలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం పట్టణం గతంలో చిన్న పంచాయతీగా ఉండేది, కేవలం 4 వేల జనాభా మాత్రమే ఉండేవాళ్లు అన్నారు. ఇక, మీ డివిజన్లను మీరే పరిశుభ్రంగా ఉంచుకోవాలి, డివిజన్‌కు కావలసిన మౌలిక సదుపాయాలు కమిషనర్ అభిషేక్ అగస్త్యను సంప్రదించండి అని సూచించారు. మన కార్పొరేషన్ ను చూసి ఇతర ప్రాంతాలు నేర్చుకునేలా ఉండాలి అన్నారు. నగరం ప్రశాంతమైన వాతావరణం ఉండాలి, కక్ష్యలకు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలని మంత్రి తుమ్మల కోరారు. అయితే, ఉన్నతమైన చదువులు చదివితే ఆ కుటుంబం పేదరికాన్ని వీడుతుంది అని మంత్రి నాగేశ్వరరావు తెలిపారు. నగర వాసులకు హైదరాబాద్, అమెరికా కంటే మంచి చదువు ఖమ్మం నగరానికి వస్తుంది అని భరోసా ఇచ్చారు. పోలీసులకు సూచించా పార్టీల పరంగా పోలీసులు ఎవరి పైనా కేసులు పెట్టొద్దని.. అలాగే, రోడ్ల వెడల్పు కోసం నాయకుల ఇండ్ల అయినా కొంత తీసుకోక తప్పదు అన్నారు. బైపాస్ రోడ్డు వేసినప్పుడు నన్ను తిట్టుకున్నారు, ఇప్పుడు బైపాస్ రోడ్డు కూడా జామ్ అవుతుంది.. ఇంకా రెండు మూడు వందల కోట్ల రూపాయలు సీఎం రేవంత్ రెడ్డినీ అడిగి తీసుకుని వస్తాను.. గుడిసెల్లో బ్రతికే పేదలకు ఇళ్లు ఇచ్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. పేదలకు మంచి చేసే విధంగా రాజకీయం ఉండాలి, ఇబ్బంది పెట్టే విధంగా ఉండకూడదని తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.



# కాళేశ్వరంపై హైకోర్టులో విచారణ వాయిదా

- కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని ఆదేశం
- కేసీఆర్, హరీశ్ రావుకు మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు
- తదుపరి ఉత్తర్వులు వెల్లడించేంతవరకు చర్యలు తీసుకోవద్దు

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకొని చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టకూడదని కేసీఆర్, హరీశ్ తమ పిటిషన్లలో వాదించారు. ఆ నివేదికను పూర్తిగా రాజకీయ ఉద్దేశ్యాలతో రూపొందించారని, దాని ఆధారంగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా సరైంది కాదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా ఆదేశించింది. కమిషన్ తరఫున లాయర్ నిరంజన్ రెడ్డి ఈ విచారణ సందర్భంగా కౌంటర్ అఫిడవిట్ సమర్పించకపోవడంపై క్షమాపణలు కోరారు. కొన్ని వివరాలు సేకరించడంలో ఆలస్యం జరిగిందని, త్వరలోనే సమగ్రమైన కౌంటర్ సమర్పిస్తామని కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆయన వివరణను అంగీకరించి, తదుపరి విచారణ తేదీని నిర్ణయించింది. ఇక ఇదే కేసులో మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. కమిషన్ నివేదికలో తమ పేర్లు ప్రస్తావించబడిన నేపథ్యంలో ప్రభుత్వం తమపై చర్యలు తీసుకోకుండా ఉండాలని వారు కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సీబీఐకి పంపిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు, ఆ నివేదిక ఆధారంగా నేరుగా చర్యలు చేపట్టకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. సీబీఐ తన స్వతంత్ర విచారణను చట్టపరమైన విధానాల ప్రకారం కొనసాగించవచ్చని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ వచ్చే నెల 12న జరగనుంది. అప్పటి వరకు కమిషన్ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ సీఎస్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌లపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు స్పష్టం చేసింది.




# బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ ఫోకస్

మొదటిపేజీ తరువాయి

అదే విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని వారు కోరారు. హైకోర్టులో రేపు జరగనున్న విచారణకు ముందు, కేసు పురోగతిపై సమగ్ర సమీక్ష జరపాలని సీఎం నిర్ణయించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 4:30 గంటలకు హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొననున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. న్యాయ పోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి.

## తెరపైకి తెలుగుదేశం పార్టీ

మొదటిపేజీ తరువాయి

కౌంటింగ్ నిర్వహించి ఫలితాన్ని ప్రకటించనున్నారు.. అయితే, ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. ఈ నెల 13 నుంచి 21వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు.. 22న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు 24వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అయితే, అన్ని పార్టీలు జూబ్లీ హిల్స్‌పై ఫోకస్ పెట్టాయి.. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తమ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత గోపీనాథ్ పేరును ప్రకటించారు. ఇక, ఇవాళో.. రేపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరు అనేది తేలిపోనుంది.. ఇంకో వైపు.. బీజేపీ కూడా తమ అభ్యర్థిని పెట్టేందుకు సమావేశాలు నిర్వహిస్తోంది.. ఇప్పుడు అనూహ్యంగా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తెరపైకి వచ్చింది.. ఇవాళ తెలంగాణకు చెందిన టీడీపీ నేతలతో సమావేశం అయ్యారు. టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు.. ఈ సమావేశంలో ప్రధానంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపైనే చర్చ సాగింది. దీంతో, టీడీపీ తమ అభ్యర్థిని బరిలోకి దింపనుందా? లేదు ఏ పార్టీకైనా మద్దతు పలుకుతుందా? అనేది చర్చగా మారింది. అయితే, జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యే గోపీనాథ్ మృతిచెందిన నేపథ్యంలో ఈ ఉపఎన్నిక జరుగుతోన్న విషయం విదితమే కాగా.. మాగంటి గోపీనాథ్ టీడీపీలో గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన వ్యక్తే కావడం.. మరోసారి అదే ఫ్యామిలీకి టికెట్ ఇవ్వడంతో.. బీఆర్ఎస్ అభ్యర్థికే చంద్రబాబు మద్దతు ప్రకటిస్తారా? అనేచర్చ సాగుతున్నది. మరోవైపు, బీజేపీ కూడా అభ్యర్థిపై కసరత్తు చేస్తోన్న నేపథ్యంలో.. ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు.. ఇక్కడ బీజేపీ వైపు మొగ్గు చూపుతారా? అనే మరో చర్చ కూడా సాగుతుంది.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ స్తబ్ధతకు కారణాలివే

మొదటిపేజీ తరువాయి

చర్యలే కారణమంటూ వస్తున్న ఆరోపణలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఈ ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. మార్కెట్ నెమ్మదించడానికి అసలు కారణాలు వేరే ఉన్నాయని, కేవలం తమపై నిందలు మోపడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో డిమాండ్‌కు మించి సప్లై ఉందని రంగనాథ్ వివరించారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టులు, ఫ్లాట్లు భారీ సంఖ్యలో పేరుకుపోయాయని (అన్‌సోల్డ్ ఇన్వెంటరీ), ఇది మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. దీనికి తోడు, అమెరికా వంటి విదేశాల నుంచి వచ్చే ఎన్నారై పెట్టుబడులు, రెమిటెన్స్‌లు గణనీయంగా తగ్గిపోయాయని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న వడ్డీ రేట్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కారణంగా ఉద్యోగాలు పోతాయనే భయాలు కూడా కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయని విశ్లేషించారు. "ప్రతిదానికీ హైడ్రాను బాధ్యుల్ని చేయడం ఒక బ్లేమ్ గేమ్‌లా మారింది. మా కార్యకలాపాలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం. మరి ఖమ్మం, వరంగల్ వంటి నగరాల్లో కూడా రియల్ ఎస్టేట్ ఎందుకు నెమ్మదించింది? ఈ అంశాన్ని కూడా గమనించాలి కదా?" అని రంగనాథ్ ప్రశ్నించారు. అసలు రియల్ ఎస్టేట్ అంటే చదరపు అడుగుకు రూ.10,000, రూ.15,000 ధరలు పెరగడం కాదని, సామాన్యుడికి, మధ్యతరగతి వారికి సొంతింటి కలను అందుబాటులోకి తీసుకురావడమే నిజమైన అభివృద్ధని ఆయన అభిప్రాయపడ్డారు. అందరికీ ఇళ్లు అందుబాటులోకి వచ్చినప్పుడే అది నిజమైన రియల్ ఎస్టేట్ అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమృతప్రణయ్ ప్రేమ పెళ్లికి సంబంధించి ప్రణయ్ హత్య కేసు దర్యాప్తు సమయంలో కూడా సోషల్ మీడియాలో తనపై ఇలాగే ఎన్నో ఆరోపణలు వచ్చాయని, అయినా వృత్తిధర్మాన్ని విడిచిపెట్టలేదని రంగనాథ్ గుర్తుచేశారు. బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గకుండా లక్ష్యంపైనే దృష్టి పెడితే వాస్తవాలు వాటంతట అవే బయటకు వస్తాయని ఆయన అన్నారు.





# ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులేవీ..?

- నిధులు మంజూరు చేయని కాంగ్రెస్ సర్కారు
- సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వెంకట్ మావో

**చేర్యాల, అక్టోబర్ 7 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలంలోని ఇందిరమ్మ ఇల్లుల గృహ నిర్మాణదారుల పరిస్థితి దయనీయంగా మారింది. అప్పులు తీర్చలేక.. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేక ఇద్దరమ్మా ఇల్లుల లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో అన్నారు, మంగళవారం సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్ మావో మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇల్లుల బిల్లుల మంజూరులో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బిల్లులు రాక ఇందిరమ్మ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని ఇది ప్రభుత్వానికి పట్టడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధల ప్రకారం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు పనులు పూర్తయినా డబ్బులు ఇంకా బ్యాంకు ఖాతాలో జమ కావడం లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు మనస్థాపానికి గురవుతున్నారని అన్నారు. బిల్లులు రాక తీసుకున్న వడ్డీ పెరుగుతోందని, ఇల్లు లేకున్నా.. ఈ బాధ ఉండేది కాదని లబ్ధిదారులు బాధపడుతున్నారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి లబ్ధిదారులకు విడుతల వారిగా డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేని యెడల లబ్ధిదారులతో కలిసి ప్రభుత్వ కార్యాలయలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో CPM చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్, CPM నాయకులు తుప్పతి రాజు, బోయినీ మల్లేశం,మల్కనిఎల్లయ్య,దండేబోయిన భాస్కర్, రాళ్లబండి చెందు, తదితరులు పాల్గొన్నారు..




## స్వతంత్ర అభ్యర్థిగా జడ్పిటిసి బరిలో డిబిఎఫ్ నేత భీమ్ శేఖర్

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ అక్టోబర్ 7 ప్రతినిధి**



దుబ్బాక జడ్పిటిసి ఎస్సీ జనరల్ రిజర్వు కావడంతో స్వతంత్ర అభ్యర్థిగా జడ్పిటిసి బరిలో ఉంటున్నట్లు డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు భీమ్ శేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే తెలంగాణ ఉద్యమంలో పాటలు పాడుతూ ఉద్యమంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఉపాధి హామీలో జరిగే సామాజిక తనిఖీ లో డిఆర్పి గా పని చెయ్యడం జరిగిందని అన్నారు. పిడిఎస్యు విద్యార్థి సంఘంలో ఉన్నప్పుడు ఆర్టీసీ కార్మికుల సమ్మెలో కీలకపాత్ర పోషించడం జరిగిందని, డిబిఎఫ్ లో కార్యకర్తగా ఉంటూ జిల్లా అధ్యక్షునిగా జిల్లాలోని విద్యార్థులు, హాస్టల్స్, ఉపాది హామీ కూలీలు, అనేక ప్రజా సమస్యలపై పనిచేయడం జరుగుతుందన్నారు. కరోన కష్టకాలంలో దుబ్బాక, సిద్దిపేట, నియోజకవర్గాలలో కరోనా పై అవగాహన కల్పించి, మాస్కులు, శానిటైజర్లు, ఆక్సిమీటర్లు, థర్మామీటర్లు పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేయడం జరిగింది. నిత్యం ప్రజల మధ్య ఉండే ఓ యువ నాయకున్ని, స్వతంత్ర అభ్యర్థిగా జడ్పిటిసి బరిలో మీ ముందుకు వస్తున్నాను, దాదాపు 9 సంవత్సరాలుగా అనేక ప్రజా సమస్యలపై పనిచేస్తున్నాను. మంచి మనసుతో ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.




## చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ పై దాడి నిరసనగా రాజ్యాంగం పై దాడి అని ఖండించిన... కెవిపిఎస్

- గజ్వేల్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన
- జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్ కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు
- కెవిపిఎస్ గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు పొట్టొల్ల దాసు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

సిజెఐ పై దాడిని ఖండించడాని కి మాటలు సరిపోవని కెవిపిఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్ అన్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు పొట్టొల్ల దాసు మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ బి.ఆర్ గవాయ్ పైనే దాడి కాదు, రాజ్యాంగంపై జరిగిన దాడి అని, తీవ్రమైన ఆగ్రహం, బాధతో గవాయి కి సంఘీభావంగా దేశమంతా నిలవాలని కోరారు. సనాతన ధర్మం దాడి బుద్ధి హీనుల చర్య అని సమాజాన్ని ద్వేషం, మతోన్మాదం ఎలా ముంచెత్తాయో చూపిస్తుందని విమర్శించారు. స్వతంత్ర న్యాయవ్యవస్థపై బహిరంగ దాడి జరిగిందని అన్నారు. దీనిని వికృత మనస్తత్వం కలిగిన వ్యక్తి చేసిన చర్యగా పరిగణించలేమని, దేశంలో న్యాయ వ్యవస్థ, దాని స్వతంత్రత, న్యాయ సమీక్ష శక్తి, లౌకికవాద భావనపై కొన్ని వర్గాల నుండి వ్యవస్థీకృతమైన, దుర్మార్గపు దుర్భాషలతో ప్రచారంలో భాగంగా దీనిని చూడాలని అన్నారు. ఇది దేశ మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురిచేస్తుందని, దేశంలో "నాథురామ్ మనసు" పథాన్ని గుర్తు చేస్తుందని విమర్శించారు. దీనిని సహించలేమని, సమాజంలోని అన్ని వర్గాలు, ముఖ్యంగా న్యాయ సోదర భావం తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇది న్యాయ వ్యవస్థపైనే కాకుండా రాజ్యాంగంపై కూడా జరిగిన దాడి అని పేర్కొన్నారు. ఈ ఘటనను క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని, నిందితుడు, తన వెనుక ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుతంగా ఖండిస్తూ నిరసనలు తెలపాలని కోరారు. దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత సనాతన ధర్మం పేరుతో మనుధర్మం పేరుతో దాడులు హత్యలు దౌర్జన్యాలు అన్ని వర్గాల ప్రజలపై మేధావులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. చీఫ్ జస్టిస్ పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం పై, న్యాయవ్యవస్థపై బీజేపీ ఆర్ ఎస్ ఎస్ చేస్తున్న కుట్రల లో భాగమే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మర్కుక్ మండల అధ్యక్షులు పరశురాములు నాయకులు గీసు మల్లేశం, కుంట బాలచంద్రం, ఈటమైన మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## దాడి జరిగింది సీజేఐ మీద మాత్రమే కాదు.. భావ ప్రకటన స్వేచ్ఛ మీద కూడా..

- బి.ఆర్.ఎస్ యువ నాయకులు తాండ్ర సాగర్

**చేర్యాల, అక్టోబర్ 7 (సిద్దిపేట పవర్)**



దేశంలోని అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి మీద దాడి జరగడం అత్యంత బాధాకరం అయిన విషయం అని చేర్యాల మండల బి.ఆర్.ఎస్ యువ నాయకులు తాండ్ర సాగర్ తెలిపారు..ఈ సందర్భంగా తాండ్ర సాగర్ మాట్లాడుతూ జస్టిస్ గవాయి ఒక దళిత వర్గానికి చెందిన వ్యక్తి అని, ఆయన మీద లాయర్ కోర్టు లోనే దాడి చేయడం వలన కుల వివక్షత మన దేశంలో ఏ విధంగా ఉందో మనకు అర్థం అవుతుంది అని ఆయన తెలిపారు.. ప్రాథమిక హక్కులు ఒకటి అయిన భావ ప్రకటన స్వేచ్ఛ ను కూడా హరించడం కూడా దేశంలోనే అత్యున్నత న్యాయ స్థానంలోనే జరిగింది అని, దీనిని ఉపేక్షించవద్దు అని, ఆ లాయర్ ను కఠినంగా శిక్షించాలి అని తాండ్ర సాగర్ డిమాండ్ చేశారు..




## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్య

- ఘనంగా పోషణ మాస ఉత్సాహలు
- సిడిపిఓ సూపర్ విజర్ సరిత
- ముఖ్యతిథులు గా డాక్టర్లు సత్య ప్రకాష్, రాజశేఖర్
- పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ కిరణ్

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఓ సరిత పేర్కొన్నారు. పోషణ మాసం ఉత్సవాలలో భాగంగా మంగళవారం జగదేవపూర్ మండలంలో దౌలాపూర్, కుకునూర్ పల్లి మండలం చిన్నకిష్టాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణి స్త్రీలకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఏటా పోషణ మాసం ఉత్సవాలను నిర్వహిస్తూ పోషకాహారంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల ప్రతి ఒకరు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్ లు ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా బాలింతలకు, గర్భిణిలకు, పిల్లలకు సరైన పోషకాహారం అందుతుందని తెలిపారు. ప్రతి ఒకరు ఆకుకూరలు, పప్పులు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. సరైన పోషణతో ఆరోగ్యతమైన తెలంగాణ సాధ్యమన్నారు. ఆరేళ్లు లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. అనంతరం గర్భిణి స్త్రీలకు సాముహిక శ్రీమంతాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు సునీత, సంతోష, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ కిరణ్, వైద్యులు రాజశేఖర్, సత్యప్రకాష్, పంచాయతీ కార్యదర్శి సతీష్ అంగన్‌వాడీ టీచర్లు వంటేరు సుజాత యం. పుష్ప సంతోష మాధవి రేణుక గౌరవ్వ కవిత నవనీత పద్మావతి వాణి సుజాత, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్ఎంసీ రీజినల్ సెంటర్ గాంధీలో 3 రోజుల శిక్షణ

- తెలంగాణలోని 25 మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్ ల అటెండ్

**సికింద్రాబాద్, అక్టోబర్ 07 ( సిద్దిపేట పవర్ ):**

మెడికల్ ఎడ్యుకేషన్‌లో ప్రాథమిక కోర్సు (బీసీఎంఈ) మూడు రోజుల శిక్షణ కార్యక్రమం రీజినల్ సెంటర్ సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో మంగళవారం గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిరా, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వాణిలు ప్రారంభించారు. ఈ శిక్షణ శిభిరం ఈనెల 10 వరకు జరగనుంది. తెలంగాణలోని 25 మెడికల్ కాలేజీలకు చెందిన ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్లు,ఎంఈయూ, సీసీ సభ్యులు పాల్గొంటారు. ఇది దేశవ్యాప్తంగా మెడికల్ విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశ్యంతో ఎన్ఎంసీ ప్రవేశపెట్టిన సీబీఎంఈ (కంపిటెన్సీ ఆధారిత మెడికల్ ఎడ్యుకేషన్) లో భాగంగా నిర్వహించబడుతుందని రీజినల్ సెంటర్ కన్వీనర్ డా.మాదల కిరణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.రాజారావు,అసిఫాబాద్ ప్రిన్సిపాల్ డా.లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్స్ డా.రవిశేఖర్ రావు,డా.రాజారామ్, కో కన్వీనర్ డా.సుభోద్ కుమార్, ఎంఈయూ మెంబర్స్ పాల్గొన్నారు.





## మృతుడి కుటుంబానికి రజక సంఘం రూ. 5000 వేల ఆర్థిక సహాయం అందజేత

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ కుకునూరుపల్లి మండల పరిధిలోని చిన్న కిష్టాపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన జూపల్లి సాయిలు కుటుంబ సభ్యులను మంగళవారం గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ ఆధ్వర్యంలో జగదేవ్ పూర్ మండల మండల రజక సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ. 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్ మాట్లాడుతూ ఉమ్మడి జగదేవపూర్ మండల రజక సంఘం ఏర్పాటులో జూపల్లి సాయిలు క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. మండలంలో రజకుల సమస్యల పరిష్కారం కోసం అమూల్యమైన సలహాలు అందించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం నాయకులు గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం కోశాధికారి మెతుకు నరసింహులు రాచమల్ల నరసింహులు జూపల్లి రాజశేఖర్ చిన్న కిష్టాపూర్ రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ సూపరింటెండెంట్ ను కలిసిన బీజేపీ యువమోర్చా నేత మర్రి

**సికింద్రాబాద్, అక్టోబర్ 07 ( సిద్దిపేట పవర్ ):**

గాంధీ ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ గా ఇటీవల నియమితులైన డా.ఎన్.వాణిని బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకులు మర్రి పురూరవరెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా భేటి అయ్యారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందచేసి, శుభాకాంక్షలు తెలిపారు. గాంధీ లో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పార్కింగ్ , మురుగునీటి సమస్య, మార్చురీ దుర్వాసన, గుండె సంబంధిత డాక్టర్ ల కొరత లాంటి సమస్యలు పరిష్కరించాలని సూపరింటెండెంట్ ను కోరారు. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులు గుంటి సత్యనారాయణ, చంద్రపాల్ రెడ్డి, కిరీటా, మంచాల గోపి, పిట్ల శ్రీనివాస్, అన్నెపాక స్వామి ఉన్నారు.



## దేవి మహిపాల్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



జగదేవపూర్ మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన దేవి మహేందర్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్ డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రభుత్వ దావఖానా లో చికిత్స పొందుతున్న దేవి మహేందర్ ను కెవిపిఎస్ గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కలసి మనోధైర్యాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్ మాట్లాడుతూ దేవి మహేందర్ గొర్రెలను మేపుతుండగా భూ వివాదాలు మనసులో పెట్టుకొని జగదేవపూర్ గ్రామానికి చెందిన బచ్చలి ఎల్లయ్య, మహేష్, మల్లయ్య కర్రతో విచక్షణ రహితంగా దాడి చేసి కులం పేరుతో దూషించుకుంటూ దాడి చేసిన వారిని ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని కులవ్యక్షత రూపుమాపే దిశగా అధికారులు ప్రతినెల 30వ తేదీన పౌర హక్కుల దినాన్ని కచ్చితంగా పాటించి పౌర సమాజంలో పౌర హక్కుల గురించి ఎస్సీ ఎస్టీ కేసుల గురించి వివరంగా తెలియజేసి కుల వివక్షత అంటరానితనం దళితులపై దాడులు చేయకుండా అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షులు పొట్టోల్ల దాసు, మర్కుక్ మండల అధ్యక్షులు డైరెక్టర్ పరుశురాం, డివిజన్ నాయకులు ఆవుల కాడి పరశురాములు, గీసు మల్లేశం, కనకయ్య, బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.